: సుందరకాండ పఠనం - కార్యక్రమ ప్రారంభంలో.... : (22.09.2020)

పల్లవి : ముద్దు గారే యశోద ముంగిట ముత్తెము వీడు
తిద్దరాని మహిమల దేవకీ సుతుడు ॥ముద్దు॥

చరణం : అంత నింత గొల్లెతల అరచేతి మాణిక్యము
పంతమాడే కంసుని పాలి వజ్రము
కాంతుల మూడు లోకాల గరుడ పచ్చ పూస
చెంతల మాలోనున్న చిన్ని కృష్ణుడు ॥ముద్దు॥

చరణం : రతికేళి రుక్మిణికి రంగుమోవి పగడము
మితి గోవర్ధనపు గోమేధికము
సతమై శంఖచక్రాల సందుల వైడూర్యము
గతియై మమ్ము గాచే కమలాక్షుడు ॥ముద్దు॥

చరణం : కాళింగుని తలలపై కప్పిన పుష్యరాగము
ఏలేటి శ్రీవేంకటాద్రి ఇంద్రనీలము
పాల జలనిధిలోన పాయని దివ్యరత్నము
బాలుని వలె తిరిగీ పద్మనాభుడు ॥ముద్దు॥

- - -